# నిన్ను క్షమించలేను

విన్నకోట సుశీలాదేవి

ఉదయం పదకొండు గంటల సమయం!

సెకండ్ పీరియడ్ జరుగుతోంది!

ఫస్ట్ డిగ్రీ వాళ్ళకు.... తెలుగు క్లాసు!

నేను అటెండెన్సు వేయడం పూర్తి చేసి తెలుగు పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నాను!

ఆ రోజు శ్రీనాథుడు వ్రాసిన భీమఖండంలోని ఒక ఘట్టాన్ని వివరించాల్సి వుంది!

శ్రీనాథుడు నా కిష్టమైన కవి! గంగా ప్రవాహంలా సాగే ఆయన శైలి ... అంటే నాకు మరీ ఇష్టం! అందులోనూ నేను చెప్పే ఘట్టం అత్యంత మధురమైనది! వ్యాసుడు కాశీలో ఏడు రోజులు అన్నం దొరక్కపోవడంతో ఎంతో కోపంతో కాశీని శపించడానికి పూనుకుంటున్నాడు!

ఆకలి ఎంత భయంకరమైనదో నేను ఆవేశంగా వివరిస్తున్నాను!

సరిగ్గా అప్పుడే కెవ్వుమన్న శబ్దం విన్పించి వులిక్కిపడ్డాను! కవితాలోకంలో విహరిస్తున్న నేను ఇహలోకంలోకి వచ్చి, నా వాక్ప్రవాహానికి అడ్డకట్ట వేసిన ఆ ధ్వని ఏమిటా అని క్లాసంతా పరికించి చూశాను!

వెనక బెంచీలో కూర్చున్న సరస్వతి లేచి నిలబడింది!

"మాష్టారూ ..." అని పిలిచింది!

నేను దగ్గరకు వెళ్ళి–

"ఏం జరిగిందమ్మా!" అనడిగాను!

"చూడండి . సార్ " అంటూ వెనక్కి తిరిగింది. వెనక ఆమె జాకట్టు మూడు వంతులు కత్తిరించబడి వుంది! ఆమె వెనక కూర్చున్న వెధవలెవరో చేసిన పని.

అది చూసి కుర్రాళ్ళు బిగ్గరగా నవ్వారు!

మిగిలిన ఆడపిల్లలు సిగ్గుతో తలొంచుకున్నారు!

సరస్వతి కళ్ళ నుండి నీళ్ళు– జారి చెక్కిళ్ళపై వర్షంలా పడసాగాయి! బుజం నిండుగా కొంగు కప్పుకుని ఏడుస్తూ వెళ్ళిపోయింది!

ఈ ఘోరాన్ని చూడగానే నా మనస్సు మండిపోయింది! కోపం తారస్థాయికి చేరుకుంది!

అందులోనూ నేను పాఠం చెప్తున్న క్లాసులో ఒక ఆడపిల్లకు ఇంత అవమానం జరగడం చూసి నేను సహించలేకపోయాను!

సరస్వతి కూర్చున్న బెంచీ వేపు చూశాను! ఆ బెంచీలో మరో అయిదుగురు ఆడపిల్లలున్నారు! ఆ వెనక బెంచీలో ముగ్గురు కుర్రాళ్ళు వున్నారు! వాళ్ళ వేపు తీక్షణంగా చూస్తూ–

"మీలో ఎవరు చేశారీ పని?" అనడిగాను తీవ్రంగా!

కానీ ఎవ్వరూ మాట్లాడలేదు!

అడిగింది తమను కాదన్నట్లు నిర్లక్ష్యంగా కూర్చున్నారు. నాకు మండిక్కిపోయింది!

"మీరు ముగ్గురూ నిలబడండి" అన్నాను

కానీ నిలబడలేదు!

ఒక లెక్చరరుగా ఈ నిర్లక్ష్యాన్ని భరించలేకపోయాను!

"సిగ్గులేని పని చేసి– పైకి చెప్పుకోడానికి సిగ్గు అడ్డొచ్చిందా! అంత పిరికివాళ్ళు. ఎలా చేశారీ పని .. దొంగచాటుగా చేయడం . హీరోల లక్షణం కాదోయ్ . చేసింది ధైర్యంగా ఒప్పుకోవాలి. ఛీ! మీలాటి పిరికి వెధవల ముఖం చూడటం కూడా పాపమే...." అని అసహ్యించుకున్నాను

నా మాటలకు పౌరుషం వచ్చిందేమో వాళ్ళల్లో ఒకడు లేచి నిలబడి,

"నేనే చేశానండి!" అన్నాడు తల ఎగరేస్తూ!

"నీ పేరు"

"రవీంద్ర!"

అతన్ని ఎగాదిగా చూశాను!

జీన్స్ వేసుకున్నాడు! దుబ్బులాటి జుట్టు– మెడలో సన్నటి గొలుసు– చేతికి గడియారం– వుంగరం .

అతని ఆకారంలోనూ, నిలబడిన తీరులోనూ ఏమాత్రం వినయం కనబడ లేదు! నా కటువంటి కుర్రాళ్ళంటే చాలా చిరాకు!

"ఎందుకు చేశావీ పని?"

"అది నన్ను అవమానించింది" అన్నాడు ఎంతో నిర్లక్ష్యంగా!

సరస్వతిని "అది" అనడం నాకు చాలా బాధ కలిగించింది! అతని నోటి మీద వాత పెట్టాలన్పించింది! కానీ తమాయించుకున్నాను!

"సరస్వతి ఏం చేసింది?" అనడిగాను.

"అవన్నీ మీ కనవసరం!"

"ఏమిటోయ్ అవసరం... క్లాసులో నీతో పాటు చదువుకునే .. ఆడపిల్లని అవమానించడమా...."

"మేము పందెం వేసుకున్నాం.. ఆ పందెంలో నేను నెగ్గాను...." మిగతా కుర్రాళ్ళ వేపు చూసి నవ్వాడు

నాకు పిచ్చి కోపం వచ్చింది!

"గెటవుట్ ఫ్రమ్ మై క్లాస్" అని అరిచాను!

"నేను వెళ్ళను" అంటూ ఆ కుర్రాడు కూర్చోబోయాడు!

నా పదేళ్ళ సర్వీసులో అంతటి మొండివాడిని– భయభక్తులు లేనివాడిని చూడటం అదే ప్రథమం.

కోపంతో నా వివేకం నశించింది!

అతని చొక్కా కాలర్ పట్టుకుని– ఇవతలికి లాగి.. ఈ చెంపా, ఆ చెంపా వాయగొట్టాను 'ఛో . నీలాటి పనికిమాలిన వెధవ నా క్లాసులో వుండటానికి వీల్లేదు " అంటూ బయటికి తోశాను.

నా తోపుడుకు అతడు క్రిందపడ్డాడు– కానీ వెంటనే పైకి లేచి . 'రండిరా ... పోదాం.... ఈ పాడు క్లాసులో ఒక్క క్షణం వుండొద్దు ..." తన పక్కన కూర్చున్న స్నేహితులను పిలిచాడు!

అతడు క్లాసునే తిట్టాడో– నన్నే తిట్టాడో అర్థం కాలేదు! నా వేపు క్రూరంగా చూసి– స్నేహితులతో కలిసి బయటికి వెళ్ళిపోయాడు! అప్పటికి నా ఆవేశం కొద్దిగా తగ్గింది! కానీ పాఠం చెప్పే స్థితిలో లేను . వచ్చి నా కుర్చీలో కూర్చున్నాను!

క్లాసంతా నిశ్శబ్దంగా జరుగుతున్న దృశ్యాన్ని ప్రేక్షకుల్లా చూస్తున్నారు!

నా మెదడంతా. జరిగిన ఆ సంఘటనకు మొద్దుబారి పోయినట్లయింది! రెండు చేతుల్లో తల వాల్చుకున్నాను!

మరో అయిదు నిముషాలకు బెల్ కొట్టారు! "అమ్మయ్య" అనుకుంటూ క్లాసు బయటికి వచ్చాను! సరాసరి స్టాఫ్ రూములో కొచ్చి నా కుర్చీలో కూర్చున్నాను! జరిగిన సంఘటనని మిగిలిన స్టాఫ్ మెంబర్లకు చెప్పాలన్పించ లేదు. వాళ్ళు చేసే కామెంట్స్ వినే ఓపిక లేదు.

ప్రిన్సిపాల్‌ని గంట పర్మిషన్ అడిగి– మధ్యాహ్నానికి శెలవు చీటీ రాసి గుమస్తాకిచ్చి ... ఇంటికొచ్చాను!

నన్ను చూసి జానకి ఆశ్చర్యపోయింది! ఉదయం పది గంటలకు కాలేజీకి వెడితే– మళ్ళా సాయంత్రం అయిదు గంటలకు ఇంటి కొచ్చే నేను హఠాత్తుగా మధ్యలో వచ్చేసరికి జానకికి కంగారు కూడా కలిగినట్లుంది.

"ఏవండీ! ఒంట్లో బాగా లేదా?" అనడిగింది ఆదుర్దాగా!

"బాగానే వుంది" పొడిగా అనేసి పడక్కుర్చీలో కూర్చున్నాను!

నేను ... రోజూలా వుత్సాహంగా లేకపోవడం గమనించి జానకి నన్ను వదిలి పెట్టలేదు... ఏవేవో అడగసాగింది!

నా మనసులోని భారాన్ని తీర్చుకోవాలంటే జానకికి జరిగింది చెప్తేనే మంచిదనిపించింది!

వివరంగా చెప్పాను!

అంతా విని.. చాలాసేపటివరకూ తేరుకోలేక పోయింది.

"ఈ కాలం కుర్రాళ్ళు ..ఎలా తయారయ్యారండీ... వీళ్ళిలా చెడిపోవడానికి . ఈ వెదవ సినిమాలు, పుస్తకాలే కారణం" అంది జానకి!

"అంతేకాదు.. జానకీ! తల్లిదండ్రులు పిల్లల్ని సరిగ్గా పట్టించుకోక పోవడం మరొక పెద్ద కారణం. ఈ రోజుల్లో– ఆడా– మగా– వుద్యోగాలు చేస్తున్నారు! ఎవరి ప్రపంచం వారిది పిల్లల గురించి పట్టించుకునే తీరిక– ఓపిక వాళ్ళకు లేకుండా పోయింది! నీకొక విషయం చెప్పనా! టెన్త్ క్లాసు పాసయిన పిల్లలు ఆ వుత్సాహాన్ని ఒక బార్‌లో జరుపుకున్నారు... ఇక ఈ దేశం ఎటు పోతోందో ఆలోచించు" అన్నాను ఆవేదనగా!

జానకి మాట్లాడలేదు!

కొన్ని క్షణాలు గడిచాయి!

"జానకీ! తలనొప్పిగా వుంది! కొంచెం కాఫీ తెచ్చి పెట్టు" అన్నాను.

జానకి లోపలికెళ్ళి పది నిముషాల్లో– కాఫీ కప్పుతో తిరిగొచ్చింది!

కప్పు నాకందించి .. నా ప్రక్కనే కూర్చుంది!

"దేశం సంగతి అటుంచండి– మీరు ఆ కుర్రాడిని క్లాసులో కొట్టారు కదా! అతడు మీ మీద కోపం పెంచుకుంటాడేమో...." అంది.

జానకి మనస్సులోని భావం నాకర్థమైంది!


ఆ కుర్రాళ్ళు ఏ సందులోనో నన్ను పట్టుకుని కొడతారని భయపడుతోంది!

ఆలా జరగడానికి అవకాశం వుంది కూడా.... వాళ్ళు తప్పకుండా నాపై పగ పెంచుకుంటారు! ప్రతీకారం తీర్చుకుంటారు.... కానీ నేను దానికి భయపడటం లేదు.

"ఏం మాట్లాడరేం?"

ఆమె భయం నిజమని చెప్పి– ఆమెని బాధించడం ఇష్టం లేకపోయింది!

"ఆఁ... వాళ్ళ మొహం.... ఏం చెయ్యరు... అవసరమైతే పోలీసుల సహాయం తీసుకుంటాలే" అనేశాను తేలిగ్గా.



ఏదయినా కొన్నాళ్లపాటు మీరు జాగ్రత్తగా వుండండి చీకటి పడ్డాక బయటికి వెళ్లకండి ' అంటూ జాగ్రత్తలు చెప్పింది

అలాగే! అని తలూపాను

ప్రస్తుతం నేను ఆ కుర్రాళ్ల గురించి ఆలోచించడం లేదు భుజం నిండుగా కొంగు కప్పుకుని- ఏడుస్తూ క్లాసు నుండి వెళ్లిపోతున్న సరస్వతే నా ఆలోచనల నిండా నిండిపోయి వుంది!

* * * * * *

మర్నాడుదయం నేను మామూలుగా కాలేజీకి వెళ్లాను!

నేను వెళ్లేసరికి కాలేజీ ఎప్పటిలా లేదు సందడిగా- కోలాహలంగా వుంది! ఆ హడావుడి దేనికో అర్థం కాలేదు! ఆఫీసు రూము కెళ్లి రిజిష్టర్లో సంతకం చేసి స్టాఫు రూముకు వెళ్లబోతుండగా- ప్యూను వచ్చి- 'ప్రిన్సిపాల్ గారు రమ్మంటున్నారు' అన్నాడు!

నేను ఆయన గదిలో కెళ్లాను!

'గుడ్‌మార్నింగ్ సార్!' అన్నాను!

"కూర్చోండి మూర్తిగారూ" అన్నాడాయన

నేను కూర్చుని, 'ఎందుకో పిలిచారుట" అనడిగాను

'పిల్లల గొడవ విన్నారా?" అన్నాడాయన

కళ్లజోడు తీసి చేతిలో పట్టుకుంటూ, 'కాలేజీ చాలా సందడిగా వుంది కానీ కారణం ఏమిటో నాకు తెలీలేదు అన్నాను!

కారణం మీరే మీరు నిన్న క్లాసులో- ఒక కుర్రాడిని కొట్టారుట కదా! దానికి వాళ్లు మిమ్మల్ని క్షమాపణ అడుగుతున్నారు లేకపోతే స్ట్రైయిక్ చేస్తారుట అన్నాడు

అయితే, వాళ్లిలా నాపై కక్ష సాధిస్తున్నారన్న మాట అనుకుంటూ- ప్రిన్సిపాల్‌కు నిన్న క్లాసులో ఏం జరిగిందో వివరించి చెప్పాను

"సార్ నా క్లాసులో ఒక కుర్రాడు అలా ప్రవర్తిస్తే ఆ కుర్రాడిని శిక్షించటం, ఉపాధ్యాయుడిగా నా కర్తవ్యం - అన్నాను'

# నిన్ను క్షమించలేను

"మూర్తిగారూ! మీరు చాలా అమాయకంగా మాట్లాడుతున్నారు! గురువు శిక్షిస్తే, శిష్యులు నోర్మూసుకుని వూరుకోడానికి ఇది త్రేతాయుగం కాదండీ కలియుగం అసలు వాళ్లను శిక్షించే అధికారమే మనకు లేదు' అన్నాడాయన

నాకాయన మాటలు బొత్తిగా రుచించ లేదు

"ఎందుకు లేదు సార్! పిల్లలకు చదువు చెప్పడంతో పాటు వాళ్లని సరైన దారిలో పెట్టడం కూడా మన బాధ్యతే అందులోనూ సోదరిలాటి సాటి విద్యార్థినిపై అంతటి దౌర్జన్యం మన కళ్ల ముందే చేస్తుంటే వూరుకో గలమా? నేనే కాదు నా స్థితిలో మీరున్నా అలాగే ప్రవర్తిస్తారు" అన్నాను కొంచెం తీవ్రంగానే

"నేనా? అబ్బే లేదు లేదు ఆయన తడబడి పోయాడు!

ఆయనకు కుర్రాళ్లంటే చాలా భయం ఆ విషయం కాలేజీలో అందరికీ తెలుసు. నా స్థానంలో ఆయన వుంటే ఆయన వాళ్ల నేమీ అనడు ఆయనే క్లాసులో నుండి బయటి వస్తాడు! ఆయన విషయం తెలిసీ ఆయనని రెచ్చగొట్టడానికి అలా అన్నాను కానీ ఆయనలో చలనం కన్పించ లేదు

అసలు- ఆయన గట్టిగా నిలబడక పోవడం వలనే మా కాలేజీ కుర్రాళ్లకు చిన్న చిన్న విషయాల గురించి సమ్మె చేయడం అలవాటయి పోయింది!

బయట కుర్రాళ్ల అరుపులు మరీ ఎక్కువగా వినిపిస్తున్నాయి!

"చూశారా! కుర్రాళ్లు మరీ రెచ్చిపోతున్నారు మీరు వెంటనే ఏదో ఒక నిర్ణయానికి రావాలి" అన్నాడాయన. కంగారుపడుతూ .

ఆయన వాలకం నాకు చిరాకుని కలిగించింది కుర్రాళ్లని చూసి భయపడే ఈయన ప్రిన్సిపాలా?

"ఏం చేయమంటారు?" విసుగ్గానే అన్నాను

'మీరు క్షమాపణ చెప్పుకోవడమే మంచిది" అన్నాడాయన!

నాకాయన వేపు చూడటానికే అసహ్యమేసింది



దేశం మొత్తంమీద హరికథను సంస్కృతంలో చెప్పిన మొట్టమొదటి మహిళ కుమారి దాలిపం ఉమామహేశ్వరికి ఇటీవల ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్రపతి జ్ఞాని జెయిల్‌సింగ్ అవార్డు బహూకరించారు. ఈమె [illegible] శ్రీ సర్వారాయ హరికథా పాఠశాల విద్యార్థిని.

ఆయన అధికారం మాలాటి ఉపాధ్యాయుల మీదే ఉపాధ్యాయులంటే ఇటు విద్యార్థులకు అటు ప్రిన్సిపాల్‌కూ ఇద్దరికీ లోకువే

ఒక బాధ్యతాయుతమైన పదవిలో వున్న మీలాటి వ్యక్తి మాట్లాడవలసిన మాటలేనా ఇవి? తనతో పాటు చదువుకుంటున్న విద్యార్థినిని, సోదరిలా భావించాల్సిన ఆడపిల్లను అంత ఘోరంగా అవమానించిన ఆ కుర్రాడికి నేను క్షమాపణ చెప్పాలా! అది నా కంఠంలో ప్రాణం వుండగా జరగదు

మెల్లగా దృఢంగా చెప్పాను

ఆయన ఏదో అనబోతుండగా - ఇద్దరు లెక్చరర్లు లోపలకు వచ్చారు

సార్! కుర్రాళ్లు క్లాసులకు రారుట మాకు ఫస్టవరు క్లాసుంది ఏం చేయమంటారు!" అని అడిగారు!

"అవునండీ వాళ్లు రారు ఎలా వస్తారు? ఈయన ముందు వాళ్లకు క్షమాపణ చెప్పాలి! ఆ తర్వాతే వాళ్లు క్లాసులకు వస్తారు "ప్రిన్సిపాల్ నాపైవున్న కసిని మాటల్లో చూపాడు

"క్షమాపణ ఎందుకు?' అనడిగారు వాళ్లు!

ఆయన కారణం వివరించాడు మరో పది నిముషాల్లో కుర్రాళ్లు ఎందుకు సమ్మె చేస్తున్నారో లెక్చరర్లందరికీ తెలిసిపోయింది! ఉపాధ్యాయుల్లో రెండు వర్గాలు ఏర్పడ్డాయి కొంతమంది నన్ను క్షమాపణ చెప్పమని- మరికొంత మంది వద్దని నాకు సలహాలివ్వడం ప్రారంభించారు! నేను కాదనలేదు అంగీకరించలేదు మౌనంగా కూర్చున్నాను!

కుర్రాళ్లు ప్రిన్సిపాల్ రూము ముందు నిలబడి నాకు వ్యతిరేకంగా నినాదాలివ్వసాగారు

ప్రిన్సిపాల్‌కి కంగారుగా వుంది వాళ్ల అరుపులు ఆయన బ్లడ్ ప్రెషర్‌ని ఎక్కువ చేస్తున్నాయి

ప్యూను వారిస్తున్నా వినకుండా - అతనిని నెట్టుకుంటూ కుర్రాళ్ళు లోపలికి వచ్చారు

వాళ్లని చూసి ఆయన మరింత భయపడ్డాడు!

"ఏమిటిది? మీరంతా ఎందుకిలా లోపలికి వచ్చేశారు " అనడిగాడు కంగారుగా

'సార్! మీరు ఆ మాష్టారి చేత మా వాడికి క్షమాపణ చెప్పించండే. మేము క్లాసుల్లోకి అడుగుపెట్టం. ఎన్ని రోజులైనా సరే' అని చెప్పి వెళ్లారు.


ప్రిన్సిపాల్ నా వేపు చూశాడు. ఆయన చూపుల్లోని భావం నాకర్థమైంది. క్షణాల మీద ఒక నిర్ణయానికి వచ్చేశాను.

"సార్! కుర్రాళ్లనందర్నీ ఎసెంబ్లీ హాల్లోకి రమ్మని చెప్పండి. నేను వాళ్లతో మాట్లాడతాను" అన్నాను.

నా మాటలు వినగానే ఆయన ముఖంలో ఎంతో ప్రశాంతత కనబడింది. తలపై నుండి పెద్ద భారం దిగిపోయినట్లు హాయిగా వూపిరి పీల్చాడు.

"అమ్మయ్య... అయితే చివరకు క్షమాపణ చెప్పడానికి ఒప్పుకున్నారన్న మాట.." అన్నాడు ప్రిన్సిపాల్.

ఉపాధ్యాయుల్లో కొందరు ఆనందం కొందరు




కోపంగానూ నా వేపు చూశారు!

పావు గంటలో విద్యార్థులందరూ ఎసెంబ్లీ హాలులో సమావేశ మయ్యారు

వాళ్ల ముఖాల్లో విజయోత్సాహం కనబడుతోంది. బహుశ నన్ను సాధించానని ఆనందిస్తున్నారేమో నేను మైక్ ముందు నిలబడి కంఠం సవరించుకున్నాను

విద్యార్థులారా

ఈ సమ్మెను ఎందుకు చేస్తున్నారో మీలో కొందరికి తెలీక పోవచ్చు తెలిసినా దానిలో నిజానిజాలు అర్థం కాకపోవచ్చు జరిగింది చెప్పడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను నిన్న నేను పాఠం చెప్తున్నప్పుడు ఒక విద్యార్థి. సాటి విద్యార్థిని యొక్క జాకెట్టు వెనక భాగాన్ని కత్తిరించాడు దానిక్కారణం మరేమీ కాదు . తోటి విద్యార్థులతో పందెం కట్టాడుట. దాన్ని గెలవడం కోసం ఆ విధంగా సాటి విద్యార్థిని అవమానించాడు. ఆమె ఏడుస్తూ వెళ్లిపోయింది నేనా దారుణాన్ని చూసి సహించలేక ఆ కుర్రాడిని చెంప దెబ్బ కొట్టి బయటికి నడవమన్నాను అదీ కారణం.. డియర్ స్టూడెంట్స్ మీరందరూ సమ్మెలో పాల్గొన్నారు. కాబట్టి మీరు కూడా ఆ విద్యార్థి చేసిన పనిని సమర్థిస్తున్నారని అర్థమవుతోంది. ఆ విద్యార్థి తాను చేసిన ఈ పనికి సిగ్గుపడకపోగా నన్ను క్షమాపణ కోరుతున్నాడు. నాకేదో అవమానం కలిగిందని బాధ పడటం లేదు. ఈ సంఘం ఏమైపోతోందోనని ఆందోళన పడుతున్నాను మిమ్మల్ని నేకొన్ని ప్రశ్నలు అడుగుతున్నాను మీతో పాటు చదువుకుంటున్న అమ్మాయిలకు మీరిచ్చే గౌరవం ఇదా! మీ సోదరిని కూడా ఇలా నలుగురిలో అవమానం చేస్తారా? మీకు తల్లి – అక్క – చెల్లిలు.. అనే విచక్షణ లేదా? ఈ నాడు ఆ అమ్మాయికి జరిగిన అవమానం.. రేపు మీ చెల్లిలికి జరిగితే చూసి సంతోషిస్తారా?

ఇన్నాళ్లూ నేను పాఠం చెప్తోంది ఇలాటి నీతిలేని వాళ్లకూ మూర్ఖులకూ అని ఇప్పుడే తెలిసింది!

మీలాటి వ్యక్తులకు అడవి మృగాలకు పాఠం చెప్పి నన్ను నేనిక కించపరుచుకోలేనని అందుకే నేను నా లెక్చరర్ పదవికి రాజీనామా ఇస్తున్నాను " అని చెప్పి క్రిందికి దిగిపోయాను

క్షణకాలం హాలంతా నిశ్శబ్దమైపోయింది! బహుశ నేనటువంటి నిర్ణయానికి వస్తానని ఎవరూ వూహించి వుండరు.

ప్రిన్సిపాల్ నా దగ్గరకొచ్చి ఏదో అనబోయాడు! కానీ నేను విన్పించుకోకుండా కాలేజీ బయటకు వచ్చేశాను

★ ★ ★ ★

ఇంటికి వచ్చి జానకికి నా నిర్ణయం చెప్పాను జానకి బాధ పడలేదు. పైగా చాలా ఆనందించింది

"పోనీండి. వెధవ వుద్యోగం చదువక్కర్లేని, ఆ కుర్రాళ్లకు పాఠాలు చెప్పేకంటే మన పల్లెటూరు కెళ్ళి మనకున్న రెండెకరాలను దున్ను కొనడం మంచిది." అంది జానకి

జానకి అలా అనడం నాకెంతో తృప్తినిచ్చింది

ఆ రాత్రి నాకు మాత్రం చాలా హాయిగా నిద్ర పట్టింది.

రెండు రోజులు గడిచాయి.

మూడో రోజు ఉదయం పేపరు చదువు కుంటుండ గా... ఏదో నా కాళ్ల మీద చల్లగా పాకినట్లయింది.

వులిక్కిపడి చూశాను రవీంద్ర నా కాళ్ల మీద పడి ఏడుస్తున్నాడు.

నేను కంగారు పడ్డాను

చేతిలోని పేపర్ని పక్కన పెట్టి . అతడిని లేవదీశాను.

ఏమిటిది? రవీంద్రా ఏడుస్తున్నా వెందుకు? ఛ ఛ అంటూ కళ్లు తుడిచాను

"నన్ను క్షమించండి మాష్టారూ" అన్నాడు ఏడుస్తూ

నాకు అతని మాటలు చాలా ఆశ్చర్యం కల్గించాయి

"రెండ్రోజుల క్రితమే నా మీద పగబట్టి క్షమాపణ అడిగిన కుర్రాడు ఇతడేనా?.. ఈ మార్పుకు కారణం ఏమిటి? అయినా ఈ మార్పు నిజమా? నటనా? ఆలోచించసాగాను

"మాష్టారూ! నేను చాలా ఘోరమైన తప్పు చేశాను. నన్ను క్షమించండి.

"రవీంద్రా! నీలో మార్పు వచ్చినందుకు నాకు చాలా ఆనందంగా వుంది కానీ నువ్వు నన్ను కాదు క్షమాపణ అడగాల్సింది నీ చేత అవమానింపబడిన సరస్వతిని అడుగు . వెళ్లు " అన్నాను.

రవీంద్ర తలొంచుకుని నిలబడ్డాడు

'ఏం? సరస్వతిని . అడగడం అవమానంగా భావిస్తున్నావా?" కొంచెం కోపంగా అన్నాను

"కాదు. సార్ "

"మరేమిటి?"

"సరస్వతి ఆత్మహత్య చేసుకుంది సార్."

పిడుగుపడ్డట్లు నిశ్చేష్టుడనై పోయాను

"నిజంగానా "

"అవును సార్ నావల్లనే ఈ ఘోరం జరిగింది సార్. నన్ను క్షమించండి "

మళ్లా నా కాళ్ల మీద పడ్డాడు.

నేను కాళ్లను వెనక్కు లాక్కుని, "రవీంద్రా! నీలోని మార్పుకు కారణం. ఆమె మరణమే అయితే. నీది క్షమించరాని మహాపరాధం రవీంద్రా! నీవు హంతకుడివి! వెళ్లు నా కంటికి కనబడకుండా వెళ్లు" బాధ – కోపం పెనవేయగా భారంగా లో పలకు వచ్చి తలుపేశాను □